ప్రజాశక్తి
బుధవారం 21 జూన్ 2023 5 విజయనగరం



మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, బకాయి హెల్త్‌అలవెన్సులు, సరెండర్ లీవ్ డబ్బులు తక్షణమే చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళవారం కార్పొరేషన్ కమిషనర్‌కి వినతి అందించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.భాస్కరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని సిఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు రెండు సంవత్సరాలుగా సరెండర్ లీవు డబ్బులు చెల్లించడం లేదని, సంవత్సర కాలంగా యూనిఫాం ఇవ్వలేదని తెలిపారు. విలీన ప్రాంత, వాటర్ వర్క్స్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వీటిని పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నీలాపు పైడ్రాజు, అనకాపల్లి రాఘవ, ఆకుల మజ్జు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లు.. అప్పుల పాలు

రుణాల ఒత్తిడితో ప్రాణాలు విడుస్తున్న వైనం

గాంధీ కన్న కలలను సాకారం చేస్తామంటూ వైసిపి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రజల వద్దకే పాలన అందిస్తామంటూ సచివాలయాలు.. రైతులకు అందుబాటులో సేవలంటూ రైతు భరోసా కేంద్రాలు.. గ్రామస్థాయిలో వైద్యమంటూ వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ప్రభుత్వ లక్ష్యం, గాంధీ కన్న కలలు సాకారం అవుతాయో, లేదో కానీ, ఎంతోమంది కాంట్రాక్టర్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. అందుకు నిదర్శనమే మొన్న అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు ఆత్మహత్య, ఏడాది క్రితం బొబ్బిలి మున్సిపాలిటీలో కాంట్రాక్టర్ వెలమల మహేంద్ర మరణాన్ని చెప్పొచ్చు. ప్రభుత్వ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు సర్కారు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారంతా అప్పుల పాలవుతున్నారు. కనీసం వడ్డీలు చెల్లించుకోలేక కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా బిల్లులు చెల్లించేందుకు సర్కారు సాహసించలేదని వారంతా వాపోతున్నారు.



అలజంగి ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు నిర్మించిన సచివాలయ భవనం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 34 మండలాల్లో 664 సచివాలయ భవనాలకు రూ.245.55 కోట్లు, 618 రైతు భరోసా కేంద్రాలకు రూ.135.72 కోట్లు, 485 విలేజ్ క్లినిక్ భవనాలకు రూ.84.87 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా భవన నిర్మాణాలు ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పూర్తి కాగా, మరికొన్ని గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి. సచివాలయ, రైతు భరోసా, విలేజ్ క్లినిక్‌లు భవనాలను, గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ముఖ్య నాయకులు కాంట్రాక్టర్ల అవతారమెత్తి చేస్తున్నారు. తమ ప్రభుత్వం మంజూరు చేసిన పనులకు సకాలంలో బిల్లులు అవుతాయని నమ్మకంతో వడ్డీలకు అప్పులు చేసి పనులు చేసినప్పటికీ సకాలంలో బిల్లులు కాలేదు. ఆయా పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు. చేసిన అప్పులు తీరకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

పెరిగిన ఒత్తిడి

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పుల ఒత్తిడికి గురవుతున్న కాంట్రాక్టర్లు ప్రాణాలు విడుస్తున్నారు. మూడు రోజుల క్రితం బిల్లులు సకాలంలో అవ్వకపోవడంతో బొబ్బిలి మండలం అలజంగి గ్రామ ఉపసర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. బొబ్బిలి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ వెలమల మహేంద్రకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అప్పుల ఒత్తిడి పెరగడంతో బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి, మృత్యువాత పడ్డారు. కాంట్రాక్టర్లకు పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తే అప్పులకు ఎక్కువ వడ్డీలు చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ నెలల తరబడి చెల్లించకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు పెరగడంతో కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో అప్పుల ఒత్తిడి పెరిగి మానసిక క్షోభ అనుభవిస్తున్నారు.

బిల్లులు కాకముందే పిసిల డిమాండ్!

అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెపుతున్న వైసిపి ప్రభుత్వం సొంత పార్టీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులే అభివృద్ధి పనులకు బిల్లుల కోసం పిసిలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో చేస్తున్న అభివృద్ధి పనులకు బిల్లులు అవ్వకముందే పిసిలను అధికారులు డిమాండ్ చేస్తున్నారని పేరు చెప్పేందుకు ఇష్టపడని వైసిపి సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వాపోతున్నారు. సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవన బిల్లులు, రోడ్లు, కాలువలు, ఇతర అభివృద్ధి పనుల బిల్లుల కోసం ముందుగానే పిసిలు ఇవ్వాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.

బిల్లులు సకాలంలో చెల్లించాలని డిమాండ్

సచివాలయం, రైతు భరోసా, విలేజ్ క్లినిక్ భవనాలకు, ఇతర అభివృద్ధి పనులకు బిల్లులు సకాలంలో చెల్లించి మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో వడ్డీలు పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు సకాలంలో చెల్లించాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ వాటర్ ప్లాంట్లు సీజ్ చేయాలి

తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి • జెసికి సిపిఎం వినతి



జెసికి సమస్యను వివరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అక్రమ వాటర్ ప్లాంట్లు సీజ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు.. జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ని కోరారు. అక్రమ వాటర్ ప్లాంట్లను రద్దు చేయాలని కోరిన వారిపై అక్రమంగా పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను ఎత్తివేయాలని మంగళవారం జెసిని కలిసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటో డివిజన్ పరిధిలో అయ్యప్పనగర్‌లో జననివాసాల మధ్య ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆర్ఓ వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల స్థానికుల ఇళ్లలో బోర్లు ఇంకి పోయి నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గతేడాది మే 3న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి, 27న అప్పటి కార్పొరేషన్ కమిషనర్‌కి వినతులిచ్చారని గుర్తుచేశారు. ఏడాదిపాటు ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలిందన్నారు. దాంతో ఈ ఏడాది మే మొదటి వారంలో కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్, భూగర్భజలవనరులశాఖ అధికారులకు వినతులు అందజేసినట్లు వెల్లడించారు. సీజ్ చేస్తామని అధికారులు చెప్పినా, సమస్య పరిష్కారం కాలేదన్నారు. ముందస్తు అనుమతులతో జూన్ 6న కాలనీవాసులు శాంతియుతంగా నిరసన తెలిపారని, వెంటనే రెండో పట్టణ సిఐ, మున్సిపల్ అధికారులు ప్లాంటుకు తాళంవేసి, నోటీస్ అంటించారని వివరించారు. అదేరోజు సాయంత్రం తాళాలు బద్దలుకొట్టి ప్లాంటు యథావిధిగా నిర్వహిస్తున్నారని తెలిపారు. అయ్యప్పనగర్ అసోసియేషన్ కార్యదర్శి సుదీర్, సాయి అమృతా రెసిడెన్సీ కార్యదర్శి యుఎస్ రవికుమార్, పట్టణపౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావుపై అక్రమంగా ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టారని తెలిపారు. ఆ ప్లాంట్ యజమాని పూసర్ల మధుసూదనరావు వైశ్య సామాజిక తరగతని, ఆయన భార్య ఎస్‌సి అని, పూల్‌బాగ్‌లో నివాసమున్న ఆమె తమ్ముడిని తీసుకొచ్చి, వారిద్దరితో అట్రాసిటీ కేసు పెట్టించడం దారుణమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, అక్కడ నివాసం లేని వ్యక్తులతో పెట్టించిన కేసులను తొలగించాలని కోరారు. నగరంలో అక్రమ వాటర్ ప్లాంట్లను రద్దుచేయాలని విజ్ఞప్తిచేశారు. వినతి అందజేసిన వారిలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఉన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా రీసర్వే

- పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటన
- మండల అధికారులు, సర్వేయర్లతో సమీక్ష, లాగిన్ల పరిశీలన



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-పూసపాటిరేగ, డెంకాడ

నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. జులై ఆఖరు నాటికి రెండో దశ పనులను పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో డేటాను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో పొందుపరచాలని చెప్పారు. పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో చేపడుతున్న రీసర్వే ప్రక్రియను మంగళవారం ఆమె స్వయంగా పరిశీలించారు. ముందుగా డెంకాడ మండలం మోపాడ గ్రామంలో రీసర్వేను పరిశీలించారు. రోవర్లు, ఇతర సాంకేతిక పరికరాల వినియోగం గురించి ఆరా తీశారు. మోపాడలో సంబంధిత రైతులతో కాసేపు మాట్లాడారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తర్వాత డెంకాడ తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆమె ఆన్‌లైన్లో వివరాల నమోదు జరుగుతున్న తీరుపై ఆరాతీశారు. వివిధ లాగిన్ల పనితీరును పరిశీలించారు. విలేజ్ సర్వేయర్, విఆర్ఒ, తహశీల్దార్ల లాగిన్లలో పెండింగ్ ఉన్న దశలను సరి చూశారు. డెంకాడలో రెండో దశలో భాగంగా 20 గ్రామాల్లో సర్వే చేపడుతుండగా ఆయా గ్రామాల్లో తాజా పరిస్థితిని లాగిన్ ప్రక్రియ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. జీలైన్, ఎఫ్‌లైన్ల సాయంతో రూపొందించిన మ్యాపుల గురించి అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆమె పూసపాటిరేగ మండలంలో పర్యటించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సర్వే, రెవెన్యూ విభాగపు అధికారులతో సమావేశమయ్యారు. రెండో దశలో మండలంలో 11 గ్రామాలను గుర్తించగా, అక్కడ తాజా పరిస్థితిని తెలుసుకున్నారు. ఫలితాలు తక్కువగా ఉన్న గ్రామాల్లో వేగం పెంచాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని సూచించారు. మొదటి దశలో సర్వే పూర్తయినా, సాంకేతిక కారణాలతో కృష్ణాపురంలో ఇబ్బందులు తలెత్తాయని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మరొకసారి పరిశీలించి పరిస్థితిని చక్కదిద్దాలని స్థానిక అధికారులను ఆదేశించారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతుల పాసు పుస్తకాలకు ఆధార్ అనుసంధానం చేయాలని సూచించారు. పర్యటనలో ఆర్‌డిఒ సూర్యకళ, సర్వే విభాగం ఎడి త్రివిక్రమరావు, పూసపాటిరేగ, డెంకాడ తహశీల్దార్లు భాస్కర్‌రావు, ఆదిలక్ష్మి, తదితరులు ఉన్నారు.

ఎనీ టైం.. ఎనీ సెంటర్.. మస్తుగా మద్యం

ఎనీ టైం... ఎనీ సెంటర్... తాగినోడికి తాగినంత .. అనేలా మస్తుగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. దోచుకున్నోడికి దోచుకున్నంతనేలా అక్రమ మద్యం వ్యాపారం మూడు కాయలు ఆరు పువ్వులుగా సాగుతోందనడంలో అతిశయోక్తి లేదు. సంబంధిత అధికారుల సహకారంతో గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు వెలిశాయి. మద్యం మత్తుతో ప్రశాంతమైన పల్లెల్లో అశాంతిని రగిలిస్తుంటే సంబంధిత అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోందనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం పాలసీ మద్యం దుకాణాల సిబ్బందికి వరంలా మారినట్టైంది.



- పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు
- విచ్చలవిడిగా వేలం పాటలు
- మామూళ్ల మత్తులో అబ్కారీ అధికారులు
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న ఎస్ఇబి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

జిల్లాలో అబ్కారీ అధికారుల అండదండలు, మరికొన్ని శాఖల అధికారుల సమన్వయంతో అక్రమ మద్యం వ్యాపారం సాఫీగానే సాగుతోంది. కొంతమంది ప్రజాప్రతినిధులు కనుసన్నల్లో కొన్ని ప్రభుత్వం మద్యం దుకాణాలు నడుస్తున్నాయని బాహటంగానే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి పట్టపగలే సీసాకు అదనంగా రూ.10 తీసుకొని ఆటోలు, ద్విచక్ర వాహనాలపై బెల్టు దుకాణాలకు తరలిస్తున్న పరిస్థితి పలువురిని విస్మయానికి గురిచేస్తోంది. అవేవీ తమకు కనబడుటలేదనే అధికారుల ప్రదర్శిస్తున్న తీరు విస్మయం కలిగిస్తోంది. బెల్టు దుకాణాలు నియంత్రించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఎస్ఇబి (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అధికారులు తూట్లు పొడుస్తున్నారని కొంతమంది ప్రజా ప్రతినిధులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు కాసులకు కక్కుర్తి పడటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.

ప్రభుత్వ నిర్ణయానికి తూట్లు

ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో ఎటువంటి దుకాణాలు ఉండకూడదన్నది సర్కారు నిర్ణయం. దానికి విరుద్ధంగా ప్రతి మద్యం దుకాణం వద్ద కిల్లీ బడ్డీలను, కక్క, ముక్కలు అమ్మే దుకాణాలు విచ్చలవిడిగా విక్రయాలు చేస్తున్నాయి. మందుబాబులకు కావాల్సిన గ్లాస్, వాటర్ ప్యాకెట్ల సదుపాయం కల్పించి అక్కడే మద్యం సేవించేలా మందుబాబులు కూర్చోవటానికి కుర్చీలు, బల్లలు ఏర్పాటు చేస్తున్నారు. పర్మిట్ షాపుల్లా, మినీబార్లలా నిర్వహించి గంటల సమయం మందుబాబులు అక్కడే తిష్టవేస్తున్నా లంచాలు మరిగిన అధికారులు చూసీచూడనట్లు వదిలేయడం విమర్శలకు తావిస్తోంది.

గ్రామాల్లో వేలం పాటలు

మద్యం పాలసీకి తూట్లు పొడిచి గ్రామాల్లో విచ్చలవిడిగా లక్షల్లో వేలం పాటలు వేస్తున్నారు. జిల్లాలో ఈ తంతు ఎక్కడికక్కడే సాగుతోంది. పూసపాటిరేగ మండలంలోనైతే, చింతపల్లి, పతివాడ, కోనాడ, తిప్పలవలస, కనిమెట్ట, వెంపడాం తదితర గ్రామాల్లో వేలం పాటలు నిర్వహించి, మద్యం విక్రయాలు చేస్తున్నారు. విషయం తెలిస్తే తమ వాటా ఎంతంటూ ఎస్ఇబి అధికారులు అడుగుతున్నారంటూ కొంతమంది పెద్దలు చెబుతున్నారు. ఈ విషయం బయటకు రాకుండా వేలం వేసుకోవాలని సంబంధిత అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు ఎస్ఇబి అధికారులపై గ్రామాల్లో ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

బెల్టు దుకాణాలపై స్పందనలో ఫిర్యాదు



ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి సిబ్బందే బెల్ట్‌షాపులకు మద్యం తరలిస్తున్నారు. సీసాపై రూ.10 అదనంగా తీసుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఈ విషయం తెలిసినా సంబంధిత అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. తూతూ మంత్రంగా దాడులు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. అందుకే స్పందనలో ఫిర్యాదు చేశాను. ఇప్పటికీ స్పందించకపోతే నేరుగా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తాను.

- టి.సీతారాం, సర్పంచి, పూసపాటిరేగ

అధికారుల కనుసన్నల్లోనే బెల్ట్ షాపులు



దాదాపు అన్ని గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఉన్నాయి. రహదారులపై మందుబాబుల చిందులు, రహదారి పక్కన, బస్ షెల్టర్ల వద్ద, బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడే విచ్చలవిడిగా మద్యం సేవించడం, బహిరంగ విక్రయాలు చూస్తుంటే.. సంబంధిత అధికారుల ప్రోత్సాహంతోనే ఇదంతా జరిగినట్లు కనిపిస్తోంది. దీనిపై కచ్చితమైన నిఘా కొరవడంతోనే ఇలా విచ్చలవిడి మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయి

- బచ్చల సూర్యనారాయణ, సిపిఎం నాయకులు, పూసపాటిరేగ

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ శాఖలు కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. జిల్లా సహకార అభివృద్ధి కమిటీ (డిసిడిసి) తొలి సమావేశం మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని సంఘాల కార్యకలాపాలు నామమాత్రంగా ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సౌకర్యాలను వినియోగించుకొని వాటి పరిధి పెంచాలని సూచించారు. ఆయా సంఘాల దృక్పథంలో మార్పును తీసుకువచ్చి, ఇతర రంగాలవైపు అడుగుపెట్టేలా నడిపించాలని కోరారు. ముఖ్యంగా సేవా రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో ఏర్పాటైన సహకార సంఘాల కార్యకలాపాలపై ఆరాతీశారు. ఆయా సంఘాలను బలోపేతం చేయడానికి, నెలరోజుల్లో తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం ఎపి కో-ఆపరేటివ్ సొసైటీ చట్టం-1964 ప్రకారం నమోదైన సంఘాలు 454, ఎపి ఎంఎసిఎస్ యాక్ట్-1995 ప్రకారం నమోదైన సంఘాలు 1784 ఉన్నాయని తెలిపారు. సమావేశంలో జెసి కె.మయూర్ అశోక్, డిసిసిబి సిఇఒ జనార్దన, డిపిఒ శ్రీధర్ రాజా, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్ధకశాఖ జెడి విశ్వేశ్వరరావు, మత్స్యశాఖ డిడి నిర్మలా కుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి, పంచాయితీరాజ్ ఎస్ఇ బిఎస్ఆర్ గుప్త, మత్స్యకార ఫెడరేషన్ ప్రతినిధి బర్రి చిన్నప్పన్న, నాబార్డ్ డిడిఎం నాగార్జున, పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వరరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 6న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖలోని డాబాగార్డెన్స్‌లో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఆగస్టు 6న ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు నల్లూరు నూకరాజు తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంప్రదాయ పద్ధతుల్లో వధూవరులను, తల్లిదండ్రులను కూర్చోబెట్టి పెద్దల సమక్షంలో వివాహాలు నిశ్చయించనున్నట్లు తెలిపారు. పాల్గొనేవారు 7780149250 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో చైర్మన్ దుర్గా సోమేశ్వరరావు, సావనీర్ చైర్మన్ వరప్రసాద్, కంకటాల సతీష్, సలహాదారు శివకుమార్, ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, వెత్సా సత్యనారాయణ పాల్గొన్నారు.

రహదారులు ప్రారంభం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 6, 7 డివిజన్లలో రూ.24 లక్షలతో నిర్మించిన రహదారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించారు. 22వ డివిజన్ బాసిన వీధిలో కాలువ నిర్మాణ పనులకు కోలగట్ల శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు పొంతపల్లి మాలతి, ఆల్తి సత్యకుమారి, బి.సతీష్, జోనల్ ఇన్‌ఛార్జులు బొద్దాన అప్పారావు, కోలగట్ల కృష్ణారావు, కె.తవిటిరాజు, బంగారునాయుడు, ముచ్చు శ్రీనివాసరావు, మారం బాల బ్రహ్మారెడ్డి, బోడసింగి ఈశ్వరరావు పాల్గొన్నారు.

48వ డివిజన్‌లో గడపగడపకు..

నగరంలోని 48వ డివిజన్ గాజులరేగలో పడాల వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును వివరిస్తూ ప్రజాస్పందనను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై తీశారు. కాలువలు, వీధి దీపాలు సరిగా లేవని స్థానికులు చెప్పగా, వెంటనే ఆయన స్పందించి, అధికారులకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, మాజీ కౌన్సిలర్ గార సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథయాత్ర



నగరంలో జగన్నాథస్వామి రథయాత్రను మంగళవారం వైభవంగా నిర్వహించారు. సంతపేట, మూడు కోవెలలు, అంబటి సత్రం, దాసన్నపేట, కొత్తపేట ప్రాంతాల్లోని ఆలయాల వద్ద రథాలను లాగి, ఉత్సవాన్ని నిర్వహించారు. రథయాత్రకు భారీగా జనం తరలివచ్చారు.

- ప్రజాశక్తి, విజయనగరంకోట

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో పది, ఇంటర్ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన ఆర్యవైశ్య విద్యార్థులకు మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ముందుగా వాసవీమాత చిత్రపటం వద్ద డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిభ చూపుతున్న ఆర్యవైశ్య పిల్లలను గుర్తించి, ప్రోత్సహించిన అవోపాకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అతిథులుగా బండారు బంగార్రాజు, ఎంవివి సత్యనారాయణ, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కుమ్మరిగుంట శ్రీనివాసరావు, చాంబర్ ఆఫ్ కామర్స్ జనరల్ సెక్రటరీ రవ్వా శ్రీనివాస్ మాట్లాడారు. అవోపా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్, కార్యదర్శి తవ్వా మోహనరావు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

టిడిపి నియోజకవర్గ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

స్థానిక అశోక్ బంగ్లాలో మంగళవారం టిడిపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తుకు గ్యారంటీ ప్రచారంలో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం, బస్సుయాత్ర గురించి చర్చించారు. ఈ నెల 26న అశోక్‌గజపతిరాజు జన్మదినం సందర్భంగా 25న నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సేవా కార్యక్రమాలతోనే సంఘాలకు గుర్తింపు లభిస్తుందని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి ఎ.ఎన్.శర్మ తెలిపారు. మంగళవారం నగరంలోని వి-డెంటల్ హాస్పిటల్‌లో విజయనగరం సామాజిక గ్రామీణ వైద్యులు సంక్షేమ సంఘం సమావేశాన్ని అధ్యక్షులు ఐ.గోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కోశాధికారి కనకాచారి మాట్లాడుతూ సేవాభావంతో కూడిన వైద్యవృత్తి చేసే వారికి ప్రజల ఆదరాభిమానాలు. లభిస్తాయని చెప్పారు. అదనపు కార్యదర్శి సోమేశ్వరి మాట్లాడుతూ త్వరలో జిల్లా, నియోజకవర్గాల వారీగా జరిగే సమావేశాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గౌరినాయుడు, కిశోర్, సురేంద్ర, కృష్ణంరాజు, త్రిమూర్తులు, సునీత, పైడి నాయుడు కోటి, తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగా డే

ప్రజాశక్తి-విజయనగరం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని బుధవారం స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఆయుష్ వైద్యులు వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటల నుండి 8 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజలంతా ఆహ్వానితులేనని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో హాజరై యోగా నిపుణుల సూచనలతో తమ ఆరోగ్యాలను మెరుగు పరచుకోవచ్చునని తెలిపారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత

బొబ్బిలి: పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలో నాయుడు కాలనీలో మంగళవారం గడపగడపకు ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు జిజిపి నిధులు ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మరిపి తిరుపతి, పిఏసిఎస్ అధ్యక్షులు వంగపండు శ్రీరామ్మూర్తి, మున్సిపల్ డిఇ రవి కుమార్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

స్నేహితునికి రూ.41 వేలు సాయం

డెంకాడ: భోగాపురం మండలం గుడివాడకు చెందిన సరగడ అప్పలరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న అతని స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. డెంకాడ మండలం మోదవలసకు చెందిన ఎన్నెంటి కృష్ణ ఆధ్వర్యంలో మరి కొంతమంది స్నేహితులు కలిసి మంగళవారం అప్పలరెడ్డి వద్దకు వెళ్లి రూ. 41వేలు ఆర్థిక సాయం చేశారు. నెలకు సరిపడే నిత్యావసర సరుకులు కూడా అందించారు. వీరంతా 1995 -96లో తగరపువలస జడ్‌పి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నట్టు చెబుతున్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన

వేపాడ : స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారి కె. రాజు, ధరణి సిబ్బందికి మంగళవారం ఎల్సిడిసి(లెప్రసీ) పై అవగాహన కల్పించారు. కుష్టి వ్యాధి గ్రస్తులను గుర్తించడంలో భాగంగా ఈనెల 26 నుంచి జూలై 16 వరకు జరగబోయే కార్యక్రమాలు గురించి ఏఎన్ఎంలకు ఎమ్మెల్‌హెచ్‌పిలకు, ఆశ వర్కర్లకు, వాలంటీర్లకు వివరించారు. 43 బృందాలుగా ఏర్పడి 37,390 మందినీ తనిఖీ చేయాలన్నారు. వ్యాధి లక్షణాలు నిర్ధారించి ఆరు నెలల కాలం లేకపోతే ఏడాది చికిత్స చేయాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ ఆంజనేయులు, పాల్గొన్నారు.



ఆహార ధాన్యాలను అందిస్తున్న ఎంపిపి సత్యవంతుడు

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన గేదెల అప్పారావు కుటుంబానికి మంగళవారం ఎంపిపి డి సత్యవంతుడు చేతులు మీదుగా ఆహార ధాన్యాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి సహకరిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఎంపిటిసి తాండ్రవరపు రమణ, జగ్గయ్యపేట గ్రామ ఉపసర్పంచ్ వంటాకు శ్రీను, పలువురు నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'మెనూ అమల్లో రాజీ పడొద్దు'

గుర్ల : పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం మెనూ అమల్లో రాజీ పడవద్దని వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు అన్నారు. మండలంలోని గూడెం పాఠశాలను ఆయన మంగళ వారం ఆకస్మిక తనికీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు సక్రమంగా పని చేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం విదార్థులకు అందిస్తున్న రాగి జావను రుచి చూసారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతీ విషయంలోనూ ప్రత్యేక శ్రద తీసుకోవడం జరుగుతుందన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా అన్ని వస్తువులనూ అందిస్తున్నామన్నారు. నాడు నేడుతో కార్పో రేట్ పాటశాలలకు ధీటుగా ప్రభుత్వ పాటశాలలు తయారయ్యాయన్నారు. ఈ కార్య క్రమంలో నాయకులు అప్పల నాయుడు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన అవసరం

వేపాడ: సచివాలయం ఉద్యోగులకు జగనన్న సురక్షపై అవగాహన ఉండాలని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ అన్నారు. మండలంలోని డిఆర్‌పేట సచివాలయంలో జగనన్న సురక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపిడిఒ సచివాల సిబ్బందికి, మహిళా సంఘాలకు, గ్రామ వాలంటీర్లకు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు సురక్షపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలు గూర్చి గ్రామంలో ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశు బీమాను వినియోగించుకోవాలి

బొండపల్లి : ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ పశుభీమా పథకాన్ని అందరూ వియోగించుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డివిజనల్ డిప్యూటి డైరెక్టర్ డాక్టర్ కె.వి రమణ కోరారు. మండలంలోని బిళ్ళలవలస గ్రామంలో మంగళవారం బొండపల్లి పశు వైద్యాధికారి డి.ఎమ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి రమణ మాట్లాడుతూ పశువుల భీమాలో రైతులకు ప్రభుత్వం 80 శాతం రాయితీ సొమ్ము చెల్లిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామమోహనరావు, రాచకిండాం పశు వైద్యాధికారి డి.లక్ష్మీ దీపిక పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు

బొబ్బిలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో ఈనెల 8 నుంచి 11వ తారీఖు వరకూ జరిగిన తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో యాళ్ల భార్గవి కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు మంగళవారం ఆమెను బొబ్బిలి కోటలో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన అభినందించారు. పట్టణంలో తారకరామ కాలనీకి చెందిన క్రీడాకారిణి 57 కిలోల విభాగంలో పాల్గొని సత్తా చాటిన భార్గవిని మిగతా క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం ఆమెను దుస్సాలువాతో సత్కరించారు.

మహిళలకు రక్షణగా దిశ యాప్

వంగర: దిశా యాప్ మహిళలకు ఎంతో రక్షణగా ఉంటుందని ఎస్ఐ ఆర్ జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని మద్దువలస జంక్షన్ వద్ద మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలంతా దిశా యాప్‌ను తమ తమ సెల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలు అయితే అనారోగ్యాలకు గురకావడంతో పాటు కుటుంబాలు నాశనమైపోతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, యువతీ, యువకులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ సుబ్రమణ్యం

చింతాడలో బోర్లు ఏర్పాటు

ప్రజాశక్తి- జామి

మండలంలోని చింతాడ గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు మంచి నీటి బోరు బావులు మంజూరైనట్లు గ్రామ సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం గ్రామంలో నీటి ఎద్దడి ప్రాంతాలుగా గుర్తించిన నాయీ బ్రాహ్మణ వీధితో పాటు ముత్యాలమ్మ గుడి వద్ద బోర్లు తవ్వించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ, గ్రామంలో తాగు నీటి సమస్య నివారణకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పి.నరసింహనాయుడు, దాసరి అప్పారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి- విజయనగరం టౌన్

కొత్తపేట నీళ్ల ట్యాంకు సమీపంలో యాదవ వీధికి చెందిన కే. లక్ష్మణ్ (30)మంగళవారం అనుమానస్పదంగా మృతి చెందాడు. నీళ్ల ట్యాంకు సమీపంలో గల బజాజ్ షోరూం దగ్గర ఓ ఎద్దుల బండికి ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమ్మో.. ఆ 5 కిలోమీటర్లు..

- విశాఖ -పాలకొండ రహదారిలో ప్రయాణం నరకమే ● గుంతల రోడ్డులో ప్రతిరోజూ ప్రమాదాలే ●వాహనదారులకు తప్పని ఇబ్బందులు

ప్రజాశక్తి- రేగిడి

పాలకొండ -విశాఖ ప్రధాన రహదారిలో ఉంగరాడ మెట్ట పెట్రోల్ బంక్ నుంచి సంకిలి నాగావళి వంతెన వరకు ఆ ఐదు కిలోమీటర్ల ప్రధాన రహదారి తారు రోడ్డు గుంతల మయం కావడంతో ప్రయాణం నరకానికి నకళ్లుగా ఉన్నాయని వాహనదారులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పాలకులు, ఆర్‌అండ్‌బి అధికారులు ఈ రోడ్డును పట్టించుకోకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాలంలో రాజాం నుంచి ఉంగరాడ మెట్ట పెట్రోల్ బంకు వరకు రూ.90 లక్షలతో మరమ్మతులు తూతూ మంత్రంగా జరిపారు. ఉంగరాడమెట్ట పెట్రోల్ బంక్ నుంచి సంకిలి వంతెన వరకు ఆ ఐదు కిలోమీటర్లు పూర్తిగా రోడ్డు మరమ్మత్తులు వదిలివేయడంతో ప్రయాణం మరింత దారుణంగా ఉందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. గత తొమ్మిదేళ్లుగా రాజాం, పాలకొండ, పాతపట్నం వైసిపి ఎమ్మెల్యేలు కంబాల జోగులు, విశ్వాస రాయి కళావతి, రెడ్డి శాంతి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఎన్నోసార్లు ఈ రోడ్డుపై ప్రయాణించినప్పటికీ పూర్తిస్థాయిలో రోడ్డు వేయడాన్ని పట్టించుకోకపోవడం ప్రజల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఐదు కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రతిరోజు వాహన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో



గోతులమయమైన పాలకొండ- విశాఖ ప్రధాన రహదారి

చాలా మంది శరీర భాగాలు కోల్పోయి మంచానికే పరిమితమవుతున్నారు. మరి కొంతమంది మరణించడంతో ఆ కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వైఎస్ఆర్ సోషల్ మీడియాలో మాత్రం రాజాం- పాలకొండ ప్రధాన రహదారిని సుమారు రూ.3కోట్లతో వేస్తున్నామని ప్రచారం చేస్తున్నా అది కార్యరూపం దాల్చలేదు. అసలు ఈ ప్రధాన రహదారి మరమ్మత్తులు చేపడతారా. లేదా అన్న ఆలోచనలో ప్రజలున్నారు. రాజాం నియోజకవర్గంలో కంబాల జోగులను రెండుసార్లు గెలిపించినా రోడ్డును నిర్మించకపోవడం దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రధాన రహదారి నిర్మాణానికి అసలు మోక్షం కలుగుతుందా. లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రధాన రహదారి అధికారులు, పాలకులు పట్టడా అని విమర్శిస్తున్నారు. అసలు ఈ ప్రభుత్వంలో ఈ ప్రధాన రహదారికి మోక్షం కలుగుతుందా అని విమర్శిస్తున్నారు. రానున్న ఎన్నికలలో ఓటు హక్కుతోనే ప్రజాప్రతినిదులకు తగిన బుద్ధి చెబుతామని ఇప్పటికే ఓటర్లు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం ప్రధాన రహదారికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

జి-20 సదస్సులో ప్రసంగించిన జిల్లా బాలిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జిల్లాలోని నెల్లిమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి బాలిక పెద్దమజ్జి సౌభాగ్య మంగళవారం స్విట్జర్లాండ్‌లో జరిగిన జి-20 సదస్సులో మహిళల ఆరోగ్యం, సాధికారిత వంటి అంశాల్లో సఖి ద్వారా విజయనగరం సాధించిన విజయాలను వివరించింది. కమ్యూనిటీ స్థాయిలో, పాఠశాల స్థాయిలో ఆరోగ్య పరిస్థితి అంశాలు, కళాశాల స్థాయిలో జరుగుతున్న సేఫ్ లైఫ్ హెల్త్ క్యాంపింగ్ తదితర అంశాలపై ఈ బాలిక మాట్లాడింది. కిశోర బాలికల విద్య, ఆరోగ్యం, నైపుణ్య వికాసం వంటి అంశాలను వివరించేందుకు దేశంలో కేవలం మూడు రాష్ట్రాలకు చెందిన బాలికలకు మాత్రమే ఇందులో పాల్గొనే అవకాశం లభించగా అందులో నెల్లిమర్ల బాలిక కూడా ఉంది. కలెక్టర్ నాగలక్ష్మి అందించిన ప్రోత్సాహంతో, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల సహకారంతో ఈ సదస్సులో సౌభాగ్య పాల్గొంది. యూనిసెఫ్ భాగస్వామ్యంతో విజయనగరం జిల్లాలో ఈ కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును సౌభాగ్య చక్కగా వివరించి అందరి ప్రశంసలు అందుకుంది.

కళాశాలలో డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఇదే పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యను ఇదే కళాశాలలో పూర్తి చేసుకోవాలని ఉద్బోధించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో గల ఏకైక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ధర్మవరం కళాశాల అని, ఇక్కడ అమ్మాయిల చదువుకు అన్ని సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అమ్మాయిలు చదువుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే బదులు శృంగవరపుకోటకి కూత వేటు దూరంలో గల ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుకోవాలని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో చేరిన అమ్మాయిలకు బోధించడానికి పిజిటి అర్హత కలిగిన అధ్యాపకులను ప్రభుత్వం నియమించిందన్నారు. అమ్మాయిలకు టెక్ట్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం పథకం తదితర సౌకర్యాలు అన్నీ ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ఇటీవల



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ లింగేశ్వరరెడ్డి

పాఠశాల స్థాయిలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన మిడతాన లిఖిత, కరగాని జాహ్నవిలకు జగనన్న ఆణిముత్యాలు నగదును పిఎంసి కమిటీ చైర్మన్ తగరంపూడి రమణ, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ హెచ్ఎం శివరామకృష్ణ, కళాశాల అధ్యాపకులు రహీమ్ షేక్ లాల్, ఎస్‌విఎస్ఎన్ మూర్తి, తమ్మినాన రాజేష్, సురేంద్రనాథ్, జయలక్ష్మి, ఉపాధ్యాయులు విఈ సత్యనారాయణ, పి శ్రీరాములు, చలం, ఎల్వి సత్యనారాయణ, కృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఇఒను తక్షణమే సస్పెండ్ చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆందోళన

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకం అరికట్టడంలో నిర్లక్ష్యం వహించిన మండల విద్యాశాఖ అధికారి పెంట సత్యనారాయణని సస్పెండ్ చేయాలని మంగళవారం పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా సామాన్యులకు విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన విద్యాహక్కు చట్టాన్ని తుంగలోకి తొక్కి మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలను, యూనిఫారంలను అధిక రేట్లకు అమ్మి వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. దీనిని నిరసిస్తూ ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో నిరసన కార్యక్రమం చేశామన్నారు. మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న నారాయణ అలియాస్ కేంబ్రిడ్జి పాఠశాల వాళ్ళ స్కూల్ పేరుతో ఒక ఇంట్లో బహిరంగంగా పుస్తకాలు అమ్మకం చేస్తున్నారన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని, పుస్తకాల రూమ్‌ని సీజ్ చేయాలని ఎంఇఒ సత్యనారాయణని అడిగితే సాకులు చెబుతూ మాకేంటి సంబంధం, అది మా పని కాదని యాజమాన్యానికి పూర్తిగా కొమ్ముకాసి భాధ్యత విడమరచి పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇలా విద్యార్థులకు న్యాయం చెయ్యాల్సిన ప్రభుత్వ అధికారులే భాధ్యతారాహిత్యంగా ఉంటే మిగిలిన సామాన్య విద్యార్థులకు ఎలా ప్రభుత్వ విద్య అందుతుందని, ఎలా బలోపేతం అవుతుందని ప్రశ్నించారు. తక్షణమే భాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంఇఒను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు లేని నారాయణ స్కూల్‌ని సీజ్ చేయాలని లేని పక్షాన మండల వ్యాప్తంగా విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులని ఐక్యం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కొర్రా రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు రిషి, రాము, నాయుడు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షాపులు తొలగించడం అన్యాయం

ప్రజాశక్తి- బొబ్బిలి

టిటిడి కళ్యాణ మండపం ప్రహరీ పక్కన చిరు వ్యాపారులు షాపులు తొలగించడం అన్యాయమని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. కోటలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారం చేసుకుని జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులు షాపులను అన్యాయంగా, దౌర్జన్యంగా ఖాళీ చేపించారన్నారు. టిటిడి కళ్యాణ మండపం ఇప్పుడు వచ్చినది కాదని ఎన్నో ఏళ్ల నుంచి ఉందని, అప్పుడు లేని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందో తెలియడం లేదన్నారు. కాలువలలో పూడికలు తొలగించడానికి వీలుకావడం లేదని షాక్‌గా చూపి షాపులు తొలగించడం దుర్మార్గమన్నారు. గడువు ఇస్తే తామే తొలగిస్తామని, కొన్ని రోజులు గడువు కావాలని కోరిన సమయం ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అహంకారం, అధికార మదంతో షాపులు తొలగించారని చెప్పారు. కళ్యాణ మండపంలో కారు పార్కింగ్ స్థలం ఉందని, ఆస్థలాన్ని పార్కింగ్ కోసం కాకుండా భోజనాలకు, పెళ్లి అవసరాలకు వినియోగిస్తే పార్కింగ్ సమస్య తలెత్తుతుందన్నారు. పాలకులకు బాధితులు ఉసురు తగులుతుందన్నారు. టిటిడికు సంబంధం లేని సత్యం షాపు ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. పంథాలు, కోపాలకు వెళ్లి పేదలను ఇబ్బందులు పెట్టడం అన్యాయమన్నారు. చిరు వ్యాపారులకు అదే స్థలంలో షాపులు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలని, లేదంటే తానే అక్కడ ఎదో సమయంలో షాపులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

15రోజుల్లో రోడ్డు బాగు చేయకపోతే పోరాటం

ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి దాడితల్లి ఆలయం వరకు పూల్ బాగ్ రోడ్డును 15రోజుల్లో బాగు చేయకపోతే పోరాటం చేస్తామని బేబినాయన అన్నారు. పూల్ బాగ్ రోడ్డు పూర్తిగా పాడైపోయిన ఎందుకు బాగు చేయడం లేదన్నారు. గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి పండుగకు బుగ్గి పోసి రూ.3.50లక్షలు ఖర్చు చేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులకు పిర్యాదు చేస్తామన్నారు. రోడ్డు బాగు చేసి ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక జ్యూట్ యాజమాన్యం రిటైర్డ్ కార్మికులకు పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జ్యూట్‌మిల్ గేటు వద్ద రామారావు గేటు మీటింగ్ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యూట్ యాజమాన్యం 2016 నుంచి పేరుకు పోయిన గ్రాడ్యుటీ బకాయిలు గత ఆరు నెలలుగా చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. కార్మికుల నుంచి యాజమాన్యం అప్పుగా తీసుకున్న 5,10,18 రూపాయలు ఇంత వరకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా గ్రాడ్యూటీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ కూడా యాజమాన్యం సంబంధిత అధికార్లకు గత ఆరు నెలలుగా చెల్లించలేదన్నారు. యాజమాన్య ఒప్పందం ప్రకారం నెలకు 30 గ్రాడ్యుటీ బకాయి చెక్కులు ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదన్నారు. జ్యూట్ యాజమాన్యం సకాలంలో ఈఎస్ఐ, పిఎఫ్ కంట్రీ బ్యూషన్ చెల్లించక పోవడంతో రిటైర్డ్ కార్మికులు, ఉద్యోగులు తమకు రావాల్సిన పిఎఫ్ నగదు పొందలేకపోతున్నారని, పింఛన్ సౌకర్యం




కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రామారావు

అమలు జరగక ఇబ్బందులకు గురవుతున్నారని గుర్తు చేశారు. కాగా జ్యూట్ యాజమాన్యం డెత్ ఫండ్ కార్మికుల నుంచి వసూళ్లు చేసి మృతి చెందిన కార్మికులకు వెంటనే ఇవ్వాల్సి ఉండగా మరుచటి నెల ఇవ్వడం భావ్యం కాదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఈ ఎస్ఐ, పిఎఫ్ బకాయిలు చెల్లించడంతో బాటు, 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో కార్మికులు, రిటైర్డ్ కార్మికులతో మిల్ గేటు వద్ద నిరశన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికుల పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటోలే శరణ్యం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బక్కు నాయుడుపేట ఆదర్శ పాఠశాలలో చదివే విద్యార్థులకు వెళ్లి వచ్చేందుకు ఆటోలే శరణమయ్యాయి. ఈ పాఠశాలలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు సుమారు 600 మందికి పైగా చదువుతున్నారు. గతంలో పాఠశాలలు తెరిచే సమయానికి బడి బస్సులు నడిపేవారు. ప్రస్తుతం బడి బస్సులు నడపకపోవడంతో కేజీపూడి, బొద్దాం, పాటూరు, సోంపురం, జాకెరు, బల్లంకి, బాణాది, కె.ఆర్.పేట, నల్లబెల్లి, వావిలిపాడు గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ఆటోలను ఆశ్రయించాల్సి వస్తుంది. కాగా రోజుకి రానుపోను రూ.60 ఛార్జీలు చెల్లించుకోవాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు రోజుకు రూ. 60 చెల్లించాలంటే ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బడి బస్సు సౌకర్యం కల్పించాలని పిల్లలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలకు ఆటోలో వెళుతున్న విద్యార్థులు

బెటాలియన్‌లో డిఐజి వార్షిక తనిఖీ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చింతలవలస ఎపిఎస్‌పి 5వ బెటాలియన్‌లో బెటాలియన్ డిఐజి పి. రాజకుమారి మంగళవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్‌లో సిబ్బంది పనితీరు బెటాలియన్‌కి సంబంధించిన పలు రికార్డులను ఆమె పరిశీలించారు. సిబ్బంది స్కాడ్ డ్రిల్, ఆర్ఎంసి డ్రిల్, వెపన్స్ ఎంఒబి ఆపరేషన్, ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది డెమోను వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన సిబ్బందికి జిఎస్‌టి, క్యాష్ అవార్డులను అందజేశారు. సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారం కావలసిన వాటిని పరిష్కరించి మిగిలిన సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ రాహుల్ దేవ్ వర్మ, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐజి పి. రాజకుమారి

కాలువ తీతపై వివాదం

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో సిద్దార్థ నగర్ కాలనీ నుంచి కాలువను తీయడానికి కాలనీ వాసులు ఒప్పుకోకపోవడంతో అధికారి యంత్రాంగం పోలీస్ బందోబస్తుతో మంగళవారం అక్కడికి చేరుకున్నారు. గత కొన్ని నెలలుగా ముంజేరు గ్రామస్తులకు, సిద్దార్థ కాలనీ వాసులకు కాలువ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. అయినప్పటికీ గ్రామస్తులు మరుగునీరు తమ ఇల్ల పక్క నుంచి వెళ్తే ఒప్పుకునేది లేదని భీష్మించడంతో అధికారులు చేసేది లేక వెని తిరిగారు. కాలనీలో కాలువ తీయడానికి జెసిబితో మరోసారి ప్రయత్నించగా కాలనీ మహిళలు కాలువలో నిల్చొని అడ్డుకున్నారు. అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ కాలనీలో నుంచి కాలువ తీయడానికి ఒప్పుకోమని వాగ్వివాదానికి దిగారు. అనంతరం ఎంపిడిఒ అప్పల నాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం కాలువ తీయడం లేదని రెండు రోజుల తర్వాత వస్తామని తెలిపి కాలువ తీత పనులు వాయిదా వేశారు. అధికారులు ఎప్పుడు వచ్చిన కాలువ తీయడానికి ఒప్పుకునేది లేదని కాలనీ వాసులు తెగేసి చెపుతున్నారు.

టిడ్కో గృహాలు త్వరితగతిన పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

టిడ్కో గృహాలు త్వరితగతిన పూర్తి చేసి లబ్దిదార్లకు అందించాలని ఎపి టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ ఆదేశించారు. నగర పంచాయతిలో నిర్మించిన ఎపి టిడ్కో జిప్లస్3 గృహాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పట్టణ పరిధిలో ఇళ్లు లేని పేదలకు సకల సౌకర్యాలతో ఇళ్లు నిర్మాణాలు చేపట్టిందన్నారు. అనంతరం కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ టిడ్కో ద్వారా నగర పంచాయతిలో 576 ఇళ్లను త్వరితగతిన నిర్మించి లబ్దిదారులకు అందించేలా చూడాలని, నగర పంచాయతీ పరిధిలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్దిదారులకు ఇవ్వవలసిన వాటాధనం మొత్తం సుమారుగా రూ.2.10 కోట్లును త్వరితగతిన లబ్దిదారులకు తిరిగి చెల్లించే విధంగా సహకరించాలని కోరారు. దీనిపై చైర్మన్ జె. ప్రసన్న కుమార్ సానుకూలముగా స్పందించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఎస్ఇ డి.నరసింహమూర్తి, ఇఇ బి.జ్యోతి, డిఇ బాలకృష్ణ, ఎఇ రాజీవ్ గాంధీ, సిఎల్‌టిసి ఎస్. వెంకటరమణ, మెప్మా సిఎం డి.గోవిందరావు, నగర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

రచ్చబండ ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని సింగవరంలో కీర్తి శేషులు పిట్ట అప్పల నారాయణమ్మ, బంగారి నాయుడుల జ్ఞాపకార్థం నిర్మించిన రచ్చబండను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, పూసపాటి రేగ వైసిపి నాయకులు మహంతి శ్రీనివాసరావు, పిట్ట అప్పారావు, సర్పంచ్ పిట్ట పద్మావతి పాల్గొన్నారు.



రచ్చబండను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ఆదర్శపాఠశాల విద్యార్థికి అవార్డు

ప్రజాశక్తి - కొత్తవలస

అర్ధన్నపాలెం ఎపి మోడల్ స్కూల్ విద్యార్థిని సింగంపల్లి జయశ్రీకి సిఎం జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు లభించింది. మంగళ వారం విజయవాడలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో 587 మార్కులు సాధించి స్టేట్ మూడో ర్యాంకు సాధించిన జయశ్రీకి సిఎం చేతులు మీదుగా రూ. 50వేలు నగదు, మెమెంటో, ప్రశంసా పత్రం అందించారు. అనంతరం ప్రిన్సిపాల్ పెంటకోట శివ ప్రసాద్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న జయశ్రీ